# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JAN - 2011**

సంవత్సర చందా రూ. 50/-

# సత్యవాక్కు

## చదువరులకు

## చందాదారులకు

## నూతన సంవత్సర

## శుభాకాంక్షలు

సత్యవాక్కు ప్రతి మాసము మీ చేతిలో ఉండాలంటే మీ ఆర్థిక సహాయము అత్యవసరము. ఈ నూతన సంవత్సరములో మీ బాధ్యతను నెరవేర్చండి.

మాకు చేయూత నియ్యండి.

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 31 | జనవరి - 2011 | సంచిక - 6


## దేవుడు ప్రార్ధనలకు జవాబిచ్చును
## (God Answers Prayer)

మీరు ప్రార్ధన చేయునప్పుడు మీరు అడుగు వాటినెల్లను పొంది యున్నామనినమ్ముడి. అప్పుడవి మీకు కలుగునని యేసుప్రభువు చెప్పారు (మార్కు 11:24). అయితే మనం చేయు ప్రార్థనలను దేవుడు ఆలకించుచున్నా డా? వాటికినిజముగా ఆయన జవాబి చ్చునా? ఈ రోజు తెలిసికొందాము.

దేవుడు మన ప్రార్ధనలనాలకిం చును, వాటికి జవాబిచ్చునని బైబిలు పదేపదే బోధించుచున్నది. వారు వేడు కొనక మునుపు నేను ఉత్తర మిచ్చెదను. వారు మనవి చేయుచుండగా నేను ఆలకిం చెదను" అని ప్రవక్తయైన యెషయా ద్వారా ఆయన పలికెను (యెషయా 65:24). "ఇరుకు నందుండి నేను యెహోవాకు మొఱ్ఱ పెట్టితిని, విశాల స్థలమందు యెహోవా నాకు ఉత్తర మిచ్చెను" అని దావీదు మహా రాజు పలికాడు (కీర్తన 118:5;120:1). "అడుగుడి మీకియ్య బడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును అని యేసుప్రభువు

బోధించారు (మత్తయి 7:7-8). దేవుడు మన ప్రార్ధనల నాలకించి వాటికి జవాబి చ్చునను అనేక లేఖన భాగములలో కొన్నిటిని మాత్రమే ఇక్కడ మీకు చూపించాను.

దేవుడు ప్రార్ధనలకు జవాబిచ్చునను ఉదాహరణలు, సంఘటనలు బైబిలునందు అనేకములున్నవి.

హన్నాయను స్త్రీ సంతానము లేనందున బహు దు:ఖాక్రాంతురాలై వచ్చి "యెహోవా సన్నిధిని ప్రార్ధన చేయుచు బహుగా ఏడ్చుచు సైన్యముల కధిపతియగు యెహోవా, నీ సేవకురాలనైన నాకు కలిగి యున్న శ్రమను చూచి, సేవకురాలనైన నన్ను మరువక జ్ఞాపకము చేసికొని, నీ సేవకురాల నైన నాకు మగపిల్లను దయ చేసిన యెడల, వాని తల మీదికి క్షౌరపు కత్తి యెన్నటికిని రానియ్యక వాడు బ్రదుకు దినములన్నిటను నేను వానిని యెహోవా వగు నీకు అప్పగింతునని" ప్రార్ధన చేసెను. "యెహోవా ఆమెను జ్ఞాపకము చేసికొ నెను, గనుక హన్నా గర్భమును ధరించి దినములు నిండినప్పుడు ఒక కుమారుని కని-నేను యెహోవాకు మ్రొక్కుకొని వీని నడిగితిననుకొని వానికి సమూయేలును పేరుపెట్టెను" (1సమూయేలు 1 అధ్యాయ ము). దేవుడు హన్నా ప్రార్ధనను వినెను. కుమారుని అనుగ్రహించి ఆమె ప్రార్ధనల కాయన జవాబిచ్చె ను.

దేవుడు ఏలియా ప్రార్ధనను వినెను, "నీతిమంతుని విజ్ఞాపన మన:పూర్వకమైనదై బహు బలము గలదై యుండును. ఏలియా మన వంటి స్వభావము గల మనుష్యుడే; వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్ధన చేయగా మూడున్నర సంవత్సరముల వరకు భూమి మీద వర్షింపలేదు, అతడు మరల ప్రార్ధన చేయగా ఆకాశము వర్షమిచ్చెను, భూమి తన ఫలము ఇచ్చెను" (యాకోబు 5:16- 18).

దేవుడు ఆదిమ సంఘము యొక్క ప్రార్ధనకు జవాబిచ్చెను. అపో. పేతురును యాకోబువలె చంపలెనని ఉద్దేశించి హేరోదురాజు పేతురును చెరసాలలో ఉంచెను, "సంఘమయితే అతని కొరకు అత్యాసక్తితో ప్రార్ధన చేయుచుండెను. హేరోదు అతనిని వెలుపలికి తీసికొని రావలెనని యుండగా, ఆ రాత్రియే పేతురు రెండు సంకెళ్లతో బంధింపబడి యిద్దరు సైనికుల మధ్య నిద్రించుచుండెను; మరియు కావలి వారు తలుపు ఎదుట చెరసాల కాచుకొనుచుండిరి, ఇదిగో ప్రభువు దూత అతని దగ్గర నిలిచెను; అతడుండిన గదిలో వెలుగు ప్రకాశించెను. దూత పేతురు ప్రక్కను తట్టి - త్వరగా లెమ్మని చెప్పి అతని లేపగా సంకెళ్లు అతని చేతులనుండి ఊడిపడెను, అప్పుడు దూత అతనితో - నీవు నడుము కట్టుకొని చెప్పులు తొడుగు కొనుమనెను. అతడా

లాగు చేసిన తరువాత దూత-నీ వస్త్రము పైన వేసికొని నా వెంబడి రమ్మని అతనితో చెప్పెను. అతడు వెలుపలికి వచ్చి దూత వెంబడి వెళ్లి దూత వలన జరిగినది నిజముగా జరిగెనని గ్రహింపక, తనకు దర్శనము కలిగెనని తలంచెను. మొదటి కావలిని, రెండవ కావలిని దాటి పట్టణమునకు పోవు ఇనుప గవిని యొద్దకు వచ్చినప్పుడు దానంతటదే వారికి తెరచు కొనెను. వారు బయలు దేరి యొక వీధిదాటిన వెంటనే దూత అతని విడిచి పోయెను.... అతడు మార్కు అను పేరు గల యోహాను తల్లియైన మరియ యింటికి వచ్చెను; అక్కడ అనేకులు కూడి ప్రార్థన చేయుచుండిరి ...వారు తలుపు తీసి అతని చూచి విభ్రాంతినొందిరి... ప్రభువు తన్ను చెరసాలనుండి యేలాగు తీసికొని వచ్చెనో అతడు వారికి వివరించెను" (అపొ.కా. 12:5-17). పేతురు కొరకు సంఘమం తయు అత్యాసక్తితో ప్రార్థించెను. దేవుడు వారి ప్రార్థన ఫలితముగా, ఆశ్చర్యరీతిగా పేతురును చెరసాలనుండి విడిపించెను. ఇట్టి సందర్భములను మనం ఇంకా అనేకములను దేవుని గ్రంధమైన బైబిలు లో చూడ గలము.

దేవుడు మన ప్రార్థనలకు తప్పక జవాబిస్తారు. కనీసం అయిదు రీతులుగా ఆయన ప్రార్థనలకు జవాబిస్తారు. ఆయన ప్రార్థనలకు అవును అని జవాబియ్యు వచ్చును. ఆయన మన ప్రార్థనలను నిరాక రించ వచ్చును, అంటే మనం అడిగిన వాటిని అనుగ్రహింపక పోవచ్చును. మనం ప్రార్థించిన సంగతులు జరుగుటలేనందున దేవుడు మన ప్రార్థనలకు జవాబీయలేదని తలంచరాదు, వాటిని నిరాకరించుట ద్వారా ఆయన మనకు జవాబిచ్చారు. ఒక్కోసారి మనం కొంతకాలము కనిపెట్ట వలసి వస్తాది. మనకేది ఎప్పుడు అవుస రమో ఆయన ఎరుగును, గనుక అప్పుడే ఆయన మనకు జవాబిచ్చును. ఇశ్రాయేలీ యుల విన్నపములను యిర్మియా దేవునికి సమర్పింపగా, పది దినములైన తరువాత యెహోవా వాక్కు యిర్మియాకు ప్రత్యక్షమా యెను (ఈ సందర్భమును యిర్మియా 42వ అధ్యాయములో మీరు చూడగలరు).

ఒక్కోసారి మనం అడిగిన దానికి వేరైన సంగతిని ఆయన దయచేసి మన ప్రార్థనలకు ఆయన జవాబిచ్చును. అపొ. పౌలు ఇట్లు వ్రాయుచున్నాడు "నాకు కలిగిన ప్రత్యక్షతలు బహువిశేషముగా ఉన్నందున నేను అత్యధికముగా హెచ్చిపో కుండ నిమిత్తము నా శరీరములో ఒక ముల్లు, నన్ను నలగగొట్టుటకు సాతాను యొక్క దూతగా ఉంచబడెను. అది నా యొద్దనుండి తొలగి పోవలెనని దాని విషయమై ముమ్మారు ప్రభువును

వేడుకొంటిని అందుకు–నా కృపనీకు చాలును, బలహీనత యందు నా శక్తి పరిపూర్ణమగుచున్నదని ఆయన నాతో చెప్పెను" (2 కొరింథీ 12:7–9). తన శరీర రుగ్మతను తీసివేయుమని పౌలు ప్రార్థించగా, దేవుడది తీసివేయలేదు గాని తన కృపను మరింతగా అతనికి విస్తరింప జేసెను. ఒక్కోసారి మనం ప్రార్థించిన దాని కంటె అత్యధికముగా ఆయన మనకను గ్రహించి మనకు జవాబిచ్చును. అందు వలన "మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగు వాటన్నిటి కంటెను, ఊహించు వాటన్నిటికంటెను అత్యధికముగా చేయశక్తిగల దేవునికి, క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక, ఆమేన్" (ఎఫెసీ 3:20–21).

మనం ప్రార్థన జీవితమును గడిపిన యెడల పాపములో పడకుందుము. ఒకే హృదయంలో పాపము ప్రార్థన రెండు కలిసి యుండలేవు. ప్రార్థించిన యెడల అపవాదిని ఎదిరించగలము, "అపవాది ని ఎదిరించుడి, అప్పుడు వాడు మీ యొద్దనుండి పారి పోవును. దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" (యాకోబు 4:7–8). ప్రార్థన వలన మనకు శాంతి లభించును. "దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపన ముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసు క్రీస్తు వలన మీహృదయములకును మీ తలంపుల కును కావలి యుండును" (ఫిలిప్పీ4:6,7).

యేసు ప్రభువునందు విశ్వాస ముంచండి, మీపాపముల విషయమై మారు మనస్సు పొందండి, పాపక్షమాపణ నిమిత్తం క్రీస్తులోనికి బాప్తిస్మం పొందండి. ప్రార్థించి ప్రభువు వలన దీవెనలను పొందండి. మీకు సమీపముగా నున్న క్రీస్తు సంఘమును దర్శించండి !!.

<u>క్రైస్తవ రుజువులు :</u>

## నీ తీర్పు యేమిటి ?
## (What is your Verdict ?)

క్రీస్తు పునరుత్థానము ఆదిమ సంఘము యొక్క ముఖ్యవర్తమానమై యుండెను. క్రైస్తవ్యమునకు పునరుత్థానము వెన్నెముక వంటిది. యేసుక్రీస్తు దేవుని ఏకైక కుమారుడని, ఆయన చెప్పిన మాటలే దేవుని మాటలని పునరుత్థానము

ధృవీకరించుచున్నది. పాపములు క్షమించే అధికారము ఆయన కలిగి యున్నాడనుటకు అది నిదర్శనము. ఆయనకు జీవన్మరణములపై అధికారముండినట్లు అది నిరూపించుచున్నది. ఆయన అనుచరుల పునరుత్థానముకు ముందుసూచనగా ఆయన పునరుత్థానుడయ్యారు. మనం సమృద్ధియైన జీవితం జీవించడానికి అది శక్తి నిచ్చును. మరియు మరణానంతర జీవితానికి అది నిరీక్షణ నిచ్చును.

క్రీస్తు యొక్క పునరుత్థాన మందు విశ్వాసముంచువారు గ్రుడ్డి విశ్వాసముతో చలించరు. వారి విశ్వాసము బలమైన రుజువులపైనను, ప్రత్యక్ష సాక్షుల సాక్ష్యముపైనను ఆధారపడియున్నది. (1కొరింథీ 15:5-8లో చెప్పబడిన ఒక్కొక్క వ్యక్తి యొక్క సాక్ష్యమును కోర్టువారు పరీక్షించిన యెడల వారికి కనీసము 128 గంటల వ్యవధి పట్టును. పురాతన చరిత్రలో గొప్పగా నిర్ధారించబడిన సంఘటన పునరుత్థానము.

**పునర్వీక్షణము (Review) :**

ఈ పఠనములో కొండంత ఋజువులలో బెత్తెడు మాత్రమే మనం గమనించాము. అపొస్తలుల ప్రత్యక్ష సాక్ష్యమును విన్నాము, లూకా ప్రత్యక్ష సాక్షుల నుండి సేకరించి వ్రాసిన రిపోర్టును గమనించాము. రోమీయుల యొక్కయు యూదుల యొక్కయు చరిత్రకారుల వ్రాతలను గమనించాము మరియు మొదటి రెండు శతాబ్దములలో జీవించిన సంఘ నాయకుల సాక్ష్యములను కూడ గమనించాము.

యేసుక్రీస్తు నెరవేర్చిన 66 పాత నిబంధన ప్రవచనములను పరిశీలించాము; వాటి యదార్థతను నిరూపించుచున్న పురాతత్వశాస్త్రజ్ఞుల సాక్ష్యమును కూడ పరిశీలించాము. పురాతన వ్రాత ప్రతుల యొక్క యదార్థతను పరిశీలించడానికి చరిత్రకారులు వినియోగించే ప్రతి పరీక్షలోను క్రొత్తనిబంధన విజయం సాధించింది. యేసు క్రీస్తు యొక్క జనన, మరణ, పునరుత్థానముల వంద వివరాలను చెప్పే బైబిలులో లేని 39 ఆధారములు కలవు. వాటిలో 17 క్రైస్తవేతరుల లిఖితములే. పురాతన వ్రాతలలో అన్నిటికంటే యదార్థత గల గ్రంధము క్రొత్త నిబంధనయే.

క్రొత్త నిబంధన యొక్క చారిత్రాత్మకత స్థిరపరచబడినందున యేసు తన్ను గూర్చి తాను చెప్పుకొనిన సంగతులను మనం ఎదుర్కొనాలి: "క్రీస్తును గూర్చి మీకు యేమి తోచుచున్నది? ఆయన ఎవరి కుమారుడు?" (మత్త 22:42).

**తమ విశ్వాసము నిమిత్తము అపొస్తలులు ప్రాణమర్పించిరి :**

యోహాను తప్ప మిగతా అపొస్తలులందరు క్రీస్తు కొరకు తమ ప్రాణముల

ర్పించారు. నేటి ప్రపంచములో తమ విశ్వా సము కొరకు ప్రాణములర్పించే మతోన్మాదులున్నారు. గాని వారి విశ్వా సము వాస్తవికతకు సుదూరమైనది.

గాని అపొస్తలులైతే వారేమి చూచారో, దేనినితాకి చూచారో దాని కొరకు ప్రాణములర్పించారు. వారు సత్యమని దేనిని నమ్మారో దానికొరకు చనిపోవుటకైనను సిద్ధపడ్డారు.

**సందేహశీలురు తమ మనస్సు మార్చు కొన్నారు:**

మొదట్లో యేసుయొక్క సోదరులు ఆయన యందు విశ్వాసముంచ లేదు (యోహాను 7:5). గాని ఏదో ఒకటి జరిగింది, వారు మనస్సు మార్చుకొన్నారు! యేసు తిరిగి లేచిన తరువాత యాకోబుకు ప్రత్యక్షమా యెనని పౌలు వ్రాసాడు. (1 కొరింథీ 15:7). పిమ్మట కొన్ని దినములైన తరువాత ఒకమేడ గదిలో ప్రార్ధన చేయుచున్న 120 మంది గుంపులో యున్నవారిలో యాకోబు ఒకడు (అపొ.కా. 1:14). తదుపరి యెరూషలేము సంఘములో బలమైన నాయకుడుగా యాకోబు తయారయ్యాడు (అపొ.కా. 15). మరియు అతడు క్రొత్త నిబంధనలో యూదా పత్రికను వ్రాసాడు.

యేసుక్రీస్తు ఒక వంచకుడని తార్సువాడైన సౌలు మొదట్లో అనుకొన్నాడు. క్రైస్తవ్యాన్ని అణగద్రొక్కుట కొరకతడు శాయశక్తులా ప్రయత్నించాడు. స్తెఫనును రాళ్లు రువ్వి చంపుచున్నవారి బట్టలకు అతడు కావలి యున్నాడు. మరియు సౌలు అతని చావుకు సమ్మతించాడు (అపొ.కా. 7:58- 60). సౌలు క్రీస్తు సంఘమును హింసించు టయేగాక (అపొ.కా. 8:1), యేసు శిష్యులను బెదిరించుటయును, హత్యచేయుటయును తనకు ప్రాణాధారమైనట్లు ప్రవర్తించు చుండెను (అపొ.కా. 9:1). దమస్కు పోవు మార్గములో ప్రకాశమానమైన వెలుగులో యేసు అతనికి కనబడినప్పుడు అతడు యేసుక్రీస్తని విశ్వసించెను. అతడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వెంటనే సౌలు యూదుల సమాజమందిరముల లో యేసుక్రీస్తని ప్రకటింప మొదలిడెను. తార్సువాడైన సౌలు అపొస్తలుడైన పౌలు అయెను.

తరతరాలుగా అసంఖ్యాకులైన సందేహశీలురు క్రీస్తుకుహాని తలపెట్టి తమ ప్రయత్నాలలో, పరిశోధనలలో క్రీస్తు శిష్యులుగా మారారు. మంచి మనస్సుతో ఒకడు ఋజువులను పరీక్షించగా, ఆ ఋజువులను బట్టి వారు ఆశ్చర్యచకితులువుతారు.

**సమాధిపెట్టెలపై చెక్కడములు (Ossuary Engravings):**

మొదటి శతాబ్దపు యూదుల

సమాధిపెట్టెలపై యేసు అనేపేరు గాని లేదా సిలువగుర్తు గాని చెక్కబడియుండేవి. 1873లో మరియ, మార్తల పేరుతో చెక్కబడిన పెట్టె బేతనియలో దొరికెను. దానిలో వారి ఎముకలుండెను. దాని ప్రక్కనే లాజరు యొక్క సమాధిపెట్టె దొరికెను. ప్రతి పెట్టెపైన సిలువ గురుతు చెక్కబడి యుండెను. తదుపరి వాటి సమీపములో యున్న పెట్టెలపై గ్రీకు భాషలో "యేసు, విమోచకుడు", "యేసు ప్రభువు" అని చెక్కబడియుండెను.

మత్తీయ యొక్క సమాధిపెట్టెపై యేసేయని చెక్కబడి యుండెను. ఇతడు ఇస్కరియోతు యూదా స్థానమును భర్తీ చేసిన అపొస్తలుడు (అపో.కా. 1:26). యేసుయొక్క దైవత్వమును గూర్చిన విశ్వాసము నాల్గవ శతాబ్ధములో ఆరంభమాయెనని కొందరు విరోధులు చెబుతారు. గాని మొదటి శతాబ్ధపు ఎముకల పెట్టెలే యేసు దేవుని కుమారుడనే విశ్వాసాన్ని చాటుచున్నాయి.

**ఆధునిక పండితుల సాక్ష్యము :**

అమెరికా, వెస్టన్ మిషిగన్ యూనివర్సిటీలో పురాతన చరిత్ర యొక్క ప్రొఫెసర్ డా॥ పాల్ ఎల్ మెయ్యర్ ఇట్లు చెప్పారు: "లభ్యమైన ఋజువులన్నీ న్యాయంగా విచారించి చూస్తే, చారిత్రక పరిశోధన సూత్రములను బట్టి, యేసు శరీరమునుంచిన సమాధి మొదటి ఈస్టర్ దినమున నిజంగా ఖాళీ చేయబడినదనుట యదార్థమే. వాఙ్మయ ఆధారములలో గాని, పురతాత్వశాస్త్ర పరిశోధనలో గాని పై సంగతిని కాదనుటకు ఇప్పటికింకా కించెత్తు ఆధారం యేమీ లంభించలేదు".

**Brooks Foss Wescott :** అను ఆంగ్ల వ్యాసగుణ దోషకర్త.(Critic) ఇట్లు చెప్పాడు "ఉన్నత రుజువు లన్నిటినీ గమనిస్తే, యేసుక్రీస్తు పునరుత్థానము కంటె ఎక్కువ నిరూపింపబడిన, ఆధారములు గల చరిత్రాత్మక సంఘటన మరొకటి లేదు."

**John Singleton Copey** అను ఆంగ్ల న్యాయశాస్త్రవేత్త, ఆంగ్ల చరిత్రకారుడు ఇట్లు వ్రాసాడు. "ఋజువంటే యేమిటో నాకు బాగా తెలుసు; అయితే క్రీస్తు పునరుత్థానమును గూర్చిన ఋజువు ఇప్పటికింకా కూల్చబడలేదని చెప్పుచున్నాను".

ఇంగ్లాండ్ దేశపు ముఖ్య తీర్పరియైన **Lord Darling** అనునతడు ఒకసారి ఇట్లు చెప్పాడు : "పునరుత్థానమును గూర్చిన కథ వాస్తవము కాదని వివేకము గల తీర్పరువలెవరు చెప్పజాలరు".

విజ్ఞాన కోవిధులైన ఇట్టివారి సాక్ష్యములనేకములను మనం చెప్పుకో

వచ్చును. యేసు ప్రభువు యొక్క మరణం, సమాధి పునరుత్థానముల యందు నమ్మికయుంచుట అజ్ఞాన సూచన కాదు. ప్రపంచములో యున్న గొప్ప వేత్తలు పునరుత్థాన ఋజువులను పరీక్షించి విశ్వాసులైరి.

**మన స్పందన :**

యేసు మరణమునుండి తిరిగి లేచెనని గాఢంగా నమ్ముటకు క్రొత్తనిబంధన, మరియు అనేక చారిత్రాత్మక గ్రంధములు మనకు పలుకారణముల నిచ్చుచున్నాయి. ఇప్పుడు ప్రశ్నయేమంటే క్రీస్తును మనం యేమి చేయుదుము? "ఎవడైనను ఆయన చిత్తము చేయ నిశ్చయించు కొనిన యెడల, ఆ బోధ దేవుని వలన కలిగినదో, లేక నాయంతనేనే బోధించుచున్నానో వాడు తెలిసికొనును (యోహాను 7:17). మనం విశ్వసించగోరుచున్నయెడల, యేసును గూర్చిన సత్యము నెరుగుదుము. మనం విశ్వసించ కూడదనుకొంటే, ఎన్ని రుజువులు సమర్పించబడినను మనలను నమ్మించ లేవు. ఇదొక అభ్యాస సిద్ధమైన పరీక్ష !

యేసు మరణము నుండి తిరిగిలేచి నట్లయితే, ఆయన దేవుని కుమారుడని రుజువు పర్చారు. అట్లయితే ఆయన నేడు సజీవులైయున్నారు. ఆయనను మనం ఆరాధింపతగినవాడు, ఆరాధన మూర్తి. మీరు వచ్చి నాతో సహవాసము కలిగియుండునని ఆయన మనలను ఆహ్వానించుచున్నారు. ఆయన ఇట్లు చెప్పుచున్నారు : ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము" (ప్రక 3:20).

యేసు దేవుని కుమారుడైతే, మనం ఆయన యొద్దకు వినయముతో సమీపించాలి, అహంకారముతోను, కోపబుద్ధితోను కాదు. మనం ఆయన షరతుల చొప్పుననే గాని మన షరతులపై సమీపించలేము.

**ఆ షరతులేమిటో యేసే చెప్పారు :**

"నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములలోనే యుండి చనిపోవుదురని" ఆయన చెప్పెను (యోహాను (8:24).

"ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని దేవుని రాజ్యమును చూడలేడని" ఆయన చెప్పెను. "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని" ఆయన మరల చెప్పెను (యోహా 3:3-5). అట్లనుటలో యేసు యొక్క ఉద్దేశ్యం యేమిటి? నీటిలో బాప్తిస్మము పొందే ఆత్మీయ జన్మను గూర్చి ఆయన చెప్పారు. యోహాను 3:3-5ను గూర్చి మొదటి రెండు శతాబ్దములలో వ్యాఖ్యానించిన ప్రతి సంఘ నాయకుడు బాప్తిస్మ

మును గూర్చి యేసుప్రభువు గూర్చి అక్కడ చెప్పెనని యందురు. ఒకడు విశ్వాసము ద్వారా క్రీస్తు నొద్దకు వచ్చి పాపముల నుండి వైదొలగి, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు, అట్టి వ్యక్తి పరిశుద్ధాత్మ అనువరమును దేవుని నుండి పొందును. పరిశుద్ధాత్ముడు క్రొత్త క్రైస్తవునిలో ప్రవేశించి అతనిని క్రీస్తు యొక్క సారూప్యములోనికి మార్చుటకు ఆరంభించును (2 కొరింథీ 3:18).

పెంతెకొస్తు దినమున అక్కడ యున్న ప్రజలతో పేతురు, "మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువు గాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను. వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని సహోదరులారా మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడుగగా, పేతురు మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అనువరమును పొందుదురు" (అపొ.కా. 2:36-38) అని చెప్పెను.

ఇంచుమించు మూడు వేలమంది యెరూషలేములో ఆరోజున బాప్తిస్మము పొందిరి. మరియు ఆరోజుననే సంఘము స్థాపించబడెను. క్రొత్తజన్మ దేవుని రాజ్యము లోనికి ద్వారమాయెను. యేసు ఇట్లనుచున్నారు : "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను గనుక మీమీద నాకాడి ఎత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి ; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును ఏలయనగా నాకాడి సుళువుగాను, నాభారము తేలికగాను యున్నవి" (మత్త 11:28-30).

**వ్యక్తిగత పోరాటము :**

ప్రపంచమందంతటా, ప్రజలు పునరుత్థానుడైన క్రీస్తును వ్యక్తిగతంగా ఎదుర్కొనుచు వారు మంచిగా మారి యున్నారని చెబుతారు. క్రీస్తుతో గల ఈ వ్యక్తిగత పోరాటమే నిశ్చయంగా యదార్థమైన అంతిమఋజువు. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నీవు నమ్ముచున్న యెడల విశ్వాసముతో నీవు ఆయన ఆహ్వానము నెందుకు స్వీకరించకూడదు?

బాప్తిస్మము, అనగా నీటిలో ముంచబడుట. అది క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానముల సారూప్యము, బాప్తిస్మములో ఒకడు పాపముల విషయమై మృతిబొంది యేసుతో ఏకమవుతాడు. ముంచబడుట ద్వారా ఆయనతో సమాధి చేయబడతాడు. మరియు నీటి సమాధి

నుండి లేచుట ద్వారా ఆయన పునరుత్థాన సారూప్యమును చిత్రీ కరిస్తాడు (రోమా 6:3-6; కొలస్స 2:12). పాత జీవితం మరణిస్తాది, క్రొత్త జీవితం ఆరంభిస్తాడు.

మన పాపములను తీసివేయుటకు యేసు సిలువపై మరణించినందున ఆయన మనకు క్షమాపణను ప్రసాదిస్తారు. ఆయన మనలను ఆహ్వానించుచున్నారు.

**మిగతా క్రైస్తవులతో సహవాసము :**

మన సహవాసము క్రీస్తుతో మాత్రమేకాదు గాని యితర క్రైస్తవులతోను యుండును, పాపమువలన విచ్ఛిన్నము చేయబడి మనం బలపరచబడుదుమని దేవుడెరుగును. మిగతా క్రైస్తవులు కూడ క్షమించబడి, పాపముల నుండి రక్షించ బడి, దేవుని ప్రజలుగా ప్రత్యేకింపబడిన వారే. బాప్తిస్మము పొందిన విశ్వాసుల సహవాసము ప్రపంచ వ్యాప్తమైన ఒకగొప్ప గొప్ప ఆత్మీయ కుటుంబము. బైబిలులో అది దేవుని కుటుంబమని, దేవుని రాజ్యము, క్రీస్తు యొక్క వధువు, సంఘము అని పిలువబడినది. ప్రపంచము మందం తటా యున్న పట్టణలలోను, పల్లెలలోను యున్న అనేక స్థానిక సంఘములతో కలిసి సార్వజనిక క్రీస్తు సంఘము ఉన్నది. అవన్నీ కలిసి "క్రీస్తు సంఘములు" అని పిలువబడుచున్నవి (రోమా 16:16).

అయితే తొందరపడవద్దు. క్రీస్తు సంఘములు అను పదము నేటి లోకము లో యున్న వివిధ సిద్ధాంతములను బోధిస్తు ఆచరిస్తుయున్న మతశాఖలన్నిటికీ వర్తించదు. అవి క్రీస్తు స్థాపించిన సంఘ ములు కావు. క్రీస్తు తన సంఘమును స్థాపించిన అనేక శతాబ్ధములకు ఈ మతశాఖలు మనుష్యులచే స్థాపించ బడెను. అవేమీ క్రొత్తనిబంధన కాలములో లేవు.

పరలోక రాజ్యము సమీపముగా యున్నదని యేసు దేనిని గూర్చి బోధించె నో, అదే క్రొత్త నిబంధనలో మనకు కనబడు సంఘము (మత్త 4:17) . నేను కట్టుదునని యేసు చెప్పిన సంఘమది (మత్త 16:18). పెంతెకొస్తు దినమున దాని తలుపులను పేతురు తెరిచాడు (మత్త 16:19: అపొ.కా.2). రక్షింపబడిన వారిని మొదటి దినముననే దేవుడు దేనితో చేర్చాడో ఆ సంఘమే అది (అపొ.కా. 2:47).

క్రొత్త నిబంధన సంఘ సభ్యులు అపొస్తలుల బోధయందును, సహవాస మందును, రొట్టెవిరుచుట యందును, ప్రార్ధన చేయుట యందును ఎడతెగక యుండిరి (అపొ.కా. 2:42). మానవ కల్పితము బోధలు, సిద్ధాంతములు బోధించుట కంటే (మత్త 15:9), క్రొత్త నిబంధన కాలములో సంఘనాయకులు పరిశుద్ధాత్మావేశ లేఖనము లను బోధించారు (2 తిమో 3:16-17). వారు

విడిపోకూడదు గాని ఏక మనస్సు ఏక తాత్పర్యము కలిగి యుండాలని ప్రోత్స హించబడిరి (1కొరి 1:10). నేడు కూడ దేవుని చిత్తము అదే అయ్యున్నది.

సంగ్రహముగా, మనం యేసు క్రీస్తుతోను, మిగతా క్రైస్తవులతోను వ్యక్తిగత సంబంధము కలిగియుండాలని ఆహ్వానిం చబడుచున్నాము. ఈ సహవాస ములో "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును" మనం అనుభవింతుము (2 కొరింథీ 13:14). ఈ సహవాసములో మనం మంచి మానవులుగా మార్పు జెందుదుము. నీవు విశ్వసించుచున్నావా? నీవే తీర్పరివి. నీ తీర్పుయేమిటి ?

## క్రీస్తు సువార్త యేమిటి ?
## (What is the Gospel of Christ ?)

క్రొత్త నిబంధన యొక్క ముఖ్యాంశము అంతా సువార్తయే. ఈ అంశముపై ప్రతి పేజీలోను మనకు సమాచారం లభిస్తాది. సూక్ష్మంగా చెప్పాలంటే యేసు క్రీస్తు సువార్త శుభవార్తయే. అది ఆయనను గూర్చిన మంచివార్త, ఈ రోజుల్లో అన్నీదుర్వార్తలే. గనుక యేసు క్రీస్తును గూర్చిన శుభవార్త విశ్వవ్యాప్తముగా ప్రకటించబడుట అవుసరం.

మానవుడు పాపియై మరణమునకు పాత్రుడే అయినను దేవుడు మానవుని ప్రేమించి రక్షణను అనుగ్రహించెననునది శుభవార్త, "అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని" పౌలు హెచ్చరించాడు (రోమా 3:23). మరియు పాపము వలన వచ్చుజీతము మరణమని అతడు హెచ్చరించాడు (రోమా 6:23). "అయితే దేవుని కృపాపరము మనప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" అను మాటల వలన ఆదరణ లభించును, "కాబట్టి నమ్ము వారు ఆయన కృప చేతనే, క్రీస్తుయేసునందలి విమోచనముద్వారా ఉచితముగా నీతి మంతులని తీర్చబడుచున్నారు" (రోమా 3:24). దేవుని యొక్క ఆశ్చర్యకరమైన కృప నిజముగా సువార్తయే. క్రీస్తు యొక్క మరణము, సమాధి, పునరుత్థానముల వాస్తవములు సువార్త యొక్క ముఖ్యాంశములు. అపొ. పేతురు పెంతెకోస్తునాడు మొట్టమొదటి సువార్త ప్రసంగము చేయుచు,

"దేవుడు నజరేయుడగు యేసు చేత అద్భుతములను మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్యను చేయించి, ఆయనను తన వలన మెప్పుపొందిన వానిగా మీకు కనబరచెను" అని చెప్పెను (అపొ.కా. 2:22). ఆయన చంపబడినను, మరణము ఆయనను బంధించి యుంచ లేకపోయెను. "ఈ యేసును దేవుడు లేపెను! "(అపొ.కా. 2:32). "మీరు సిలువ వేసిన ఈ యేసునే దేవుడు ప్రభువు గాను, క్రీస్తుగాను నియమిం చెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను" (అపొ.కా. 2 :36). ప్రజలు ఈ మాటల వలన హృదయ ములో నొచ్చుకొని సహోదరులారా, మేమే మి చేయవలెనని పేతురును, మిగిలిన అపొస్తలులను అడిగిరి. పేతురు – "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు. ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికిని అనగా ప్రభువైన మనదేవుడు తన యొద్దకు పిలిచిన వారందరికిని చెందునని చెప్పెను" (అపొ. కా. 2:38–39).

క్రీస్తు సువార్త అందరికీ. క్రీస్తు సంఘములో యూదులు, అన్యజనులు కూడ యుంటారు. సువార్త విన్నావారు కదలించబడ్డారు. అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి, ఆదినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి (అపొ.కా. 2:41). అనేకులు చేర్చబడుచు న్నందున సంఘము త్వరితముగా అభివృద్ధి జెందెను (అపొ.కా. 2:47).

క్రీస్తు ఇట్లు ఆజ్ఞాపించారు: "మీరు వెళ్లి సమస్తజనులను శిష్యులనుగా చేయుడి, తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయేసంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19–20).

– బాబ్ ప్రిచం

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

# క్రీస్తు ఎన్ని సంఘములు నిర్మించారు?
## (How many Churches did Jesus build ?)

ప్రపంచములో నేడు అనేక సంఘములు ఎందుకు ఉన్నాయో ఎన్నడైనా ఆలోచించావా? అవన్నీ ఎక్కడ నుండి వచ్చాయి? వాటి బోధలు అంత భిన్నముగా ఎందుకు వున్నా యి? అవి ఎందుకు వివిధనామములు ధరిస్తాయి? అవన్నీ కరక్టేనా? భిన్న సూత్రములను బోధించు రెండు సంఘాలుంటే అవి రైటేనా? ఏదైనా రెండు సంగతులు పరస్పర విరుద్ధమైనవయితే అవి రెండూ రైటు కాదని లోకజ్ఞానం మనకు తెలియజేస్తాది. గనుక నేడున్న విభిన్న మతశాఖల సంఘాల సంగతియేమిటి? అవన్నీ రైటేనా? లేక అవన్నీ తప్పా ?

మొదటిగా మనం ఈ అంశమును గూర్చియున్న అధికారమును గమనించాలి. ఈ విషయంలో నీవు, నేను తలంచేది గాక బైబిలు చెప్పుదానిని మనం పరిగణించాలి, "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్లు బోధింపవలెనని" అపో. పేతురు చెప్పుచున్నాడు. (1 పేతురు 4:11). ప్రతి మనుష్యుడును అబద్ధికుడగును గాని దేవుడు సత్యవంతుడు కాక తీరడు అని పౌలు చెప్పుచున్నాడు (రోమా 3:4).

ఇహపరములయందు సర్వాధికారము కలిగియున్న క్రీస్తు పేతురుతో, "మరియు నీవు పేతురువు. ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోకద్వారములు దాని యెదుట నిలువనేరవు" అని చెప్పెను (మత్తయి 16:18).

ప్రభువు ఏదో ఒకసంఘమును లేక అనేక సంఘములను కట్టుదునని చెప్ప లేదు. గాని "నా సంఘమును కట్టుదునని" చెప్పారు. అది ఏకవచనమును, ఒకే ఒక్క సంఘమును సూచించుచున్నది.

అబద్ధ సంఘములను గూర్చి చెబుతు యేసు "పరలోకమందున్న నాతండ్రి నాటని ప్రతిమొక్కయు పెల్లగింపబడునని" చెప్పారు (మత్తయి 15:13). తదుపరి ఒకే ఒక్క శరీరమున్నదని, పౌలు చెప్పాడు (1కొరింథీ 12:20).

**ఆ శరీరమే సంఘము. పరిశుద్ధాత్మా వేశము వలన అపొస్తలుడిట్లు వ్రాసాడు :**

"మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22 -23). ఈ న్యాయబద్ధమైన లేఖనముతో విభేదించు ఏవ్యక్తియైనా సరే నాతో కాదుగాని

దేవునితోనే విభేదించును. బైబిలు చెప్పుచున్నది గనుక దానిని నేను నమ్ముచున్నాను. నీవు నమ్ముచున్నాడా ?

సంఘము ఒక కుటుంబముగా పోల్చబడుట ద్వారా క్రీస్తు సంఘము యొక్క ఏకత్వమును గమనించగలము. దేవుడు మన తండ్రిగాను, క్రీస్తు మన పెద్ద అన్నగాను, మరందరం సహోదరులముగాను బైబిలు బోధించుచున్నది. "మనము దేవుని పిల్లలమని ఆత్మతానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమ పడిన యెడల క్రీస్తుతోడి వారసులము" (రోమా 8:16-17). దేవునికి అనేక వందల కుటుంబాలున్నట్లు బైబిలు చిత్రీకరించుట లేదు. అవన్నీ వేర్వేరు నామములు కలిగి, ఒక దానితో నొకటి పోరాడుచు, వివిధ రీతుల నాచరించు వాటిగ బైబిలు అసలే చిత్రీకరించుటలేదు. ఒకటి కంటే ఎక్కువ సంఘములున్నట్లు చెబితే, దేవునికి ఒకటి కంటే ఎక్కువ కుటుంబములున్నాయనుటే యగును. యిది బహు భార్యాతత్వమగును, సర్వశక్తుడైన దేవుని మానవులు అట్లు చిత్రీకరించకూడదు.

క్రీస్తు ఒకే ఒక్క సంఘమును నిర్మించితే, ఈ మతశాఖలన్నీ ఎక్కడ నుండి పుట్టు కొచ్చాయి? అవన్నీ మానవకల్పితములే. క్రీస్తు ఒకే ఒక్క సంఘమును నిర్మించినందున నేనాయన సంఘములో యుండ గోరుదును. నీ సంగతి యేమిటి? నీవు మానవ నిర్మిత సంఘములో యుండగోరుదువా? లేక క్రీస్తుచే క్రీస్తు రక్తముతో కడుగబడి, ఆయనకే చెందిన సంఘములో యుండ గోరుదువా? (అపొ.కా. 20:28). సమస్తాత్మీయాశీర్వాదములు క్రీస్తు నిర్మించిన సంఘములోనే యున్నట్లు జ్ఞాపక ముంచుకొనుము (ఎఫెసీ 1:3), యిది సింపుల్, అర్థం చేసికొనడం సులవే, ఆ ఒకే ఒక్క సంఘాన్ని నీవు అన్వేషించుచున్నావా ?

– టామ్ మూం

**సత్యవాణి T.V. కార్యక్రమములను**
**ప్రతి బుధ, వారము సాయంత్రం 6:30 గంటలకు**
**రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు**
**ఆరాధన ఛానల్ లోను, ఆదివారం ఉదయం 5:30 గ॥ లకు**
**ఎ-1 ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం**
**6:00 గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

# దేవుడు ఆత్మయైయున్నాడు
## (God is Spirit)

పరమందొక దేవుడున్నాడు! అది మనకెట్లు తెలియును ? ఏలయనగా దేవుడు ఆత్మయై యున్నాడు. సమరయస్త్రీతో మాట్లాడుచు క్రీస్తు దేవుని అట్లు నిర్వచించారు (యోహాను 4:24).

**దేవుడు సర్వాంతర్యామి :**

దేవుడు ఆత్మయై యున్నాడనుటలో క్రీస్తు యొక్క భావం యేమిటి? అట్లు చెప్పుటలో దేవుడు ఒక పర్వతమునకుగాని, ఆలయమునకు గాని పరిమితి చేయబడిన వాడు కాదని యేసు సమరయ స్త్రీకి వివరించారు. దేవుడు భౌతిక స్థలములను, వస్తువులను అధిగమించి అన్నిచోట్ల అన్ని సమయములయందు ఉన్నవాడు.

అపో.కా. 7:49–50ఇట్లు చెప్పుచున్నది : "ఆకాశము నా సింహాసనము, భూమి నా పాదపీఠము, మీరు నా కొరకు ఏలాటి మందిరము కట్టుదురు ? నా విశ్రాంతి స్థలము యేది? ఇవన్నియు నా హస్త కృతములు కావాయని ప్రభువు చెప్పుచున్నాడు అని ప్రవక్త పలికిన ప్రకారము సర్వోన్నతుడు హస్త కృతాలయములలో నివసింపడు".

సొలొమోను యిట్లు చెప్పాడు: "నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసముచేయడు, ఆకాశమహాకాశములు సయితము నిన్ను పట్టజాలవు, నేను కట్టించిన ఈ మందిరము ఏలగు పట్టును ?" (1రాజులు 8:27).

యిర్మీయా 23:23–24 ఇట్లు చెప్పుచున్నది: "నేను సమీపమున నుండు దేవుడను మాత్రమేనా? దూరమున నుండు దేవుడను కానా ? యెహోవా సెలవిచ్చిన మాట ఏదనగా – నాకు కనబడకుండ రహస్య స్థలములలో దాగగల వాడెవడైన కలడా? నేను భూమ్యాకాశముల యందంతట నున్నవాడను కానా? యిదే యెహోవా వాక్కు".

భక్తుడైన దావీదు ఇట్లు చెప్పాడు : "యెహోవా, వెనుకను, ముందును నీవునన్ను ఆవరించి యున్నావు, నీ చేయి నా మీద ఉంచి యున్నావు. నీ ఆత్మయొద్ద నుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్రదిగంతములలో నివసించినను అక్కడను నీ చేయినన్ను నడిపించును. నీకుడిచేయినన్ను పట్టు

కొనును".

ఈ లేఖన భాగములన్నియు యేసు సమరయ స్త్రీతో చెప్పిన గొప్ప సత్యమును, అనగా దేవుని ఏదోఒక స్థలమునకు పరిమితిచేయలేమను సత్యమును నిర్ధారించుచున్నవి. దేవుడు సర్వాంత ర్యామి, అంటే ఆత్మగా ఆయన అన్ని ప్రదేశములలో, అన్నివేళలలో యున్న వాడు గనుక మనం ఎక్కడ వుండి విన్నవించుకొనినను, ఆయన ఆలకిం చును. దేవుడు ఎంత గంభీరుడంటే ఆయన ఈ విశ్వాన్నంతటినీ ఆవరించుకొని యున్నాడు .అయినను ఆయన ఎంత చిన్నవాడంటే ఆయన మన హృదయాల్లో నివసించును ! "నేను మహోన్నతమైన పరిశుద్ధస్థలములలో నివసించువాడను, అయినను వినయము గలవారి ప్రాణము ను ఉజ్జీవింపజేయుటకును, నలిగిన వారి ప్రాణమును ఉజ్జీవింప జేయుటకును వినయము గలవారి యొద్దను దీనమనస్సు గలవారి యొద్దను నివసించుచున్నాను" అని యెషయా 57:15లో ఆయన చెప్పారు. క్రైస్తవులు దేవుని ఆలయమై యున్నారని, దేవుడు వారిలో నివసించు చున్నాడని 2 కొరింథీ 6:16లో చెప్పబడి యున్నది, యిది క్రైస్తవులందరికీ గొప్ప ఆదరణ కలిగించును. ఆయన అన్నీ వీక్షించుచున్నారని, మన ప్రార్థనలు విని వాటికి జవాబిచ్చునని తెలిసికొనుట ఎంతో ఆశ్చర్యము.

**ఆత్మతనకు తానే ఎరిగియుండును : (Spirit is Self Conscious)**

భౌతిక వస్తువులకు భిన్నంగా ఆత్మ ఎరిగియుండును. ఆత్మ తనకుగా తానును, తనతో సంబంధము గల సమస్తాన్ని ఎరిగియుండును. తమ యొక్క ఎరుకలో పరిమితిగల జంతువులకు మానవులకు భిన్నముగా పరిపూర్ణ ఆత్మయైన దేవుడు సమస్తమును ఎరిగి యున్నారు. నేను ఉందునను వాడను అని దేవుడు మోషేకు ప్రకటించినప్పుడు (నిర్గమ 3:14), ఆయన తన ఉనికిని గూర్చి తాను ఎరిగినవాడనని, నిజానికి ఆయనే ఉన్నవాడనని ప్రకటిం చారు. మన గ్రహణశక్తి పరిమితిగలది గాని దేవుని గ్రహణశక్తి సంపూర్ణమైనది, పరిపూర్ణమైనది, ఆయన సమస్తమును ఎరిగి యున్నారు గనుక ఆయనకు సలహాదారుడు గాని మధ్యవర్తి గాని అక్కరలేదు. నేను అనుదేవుడు నీవు అని పిలవబడుచు ఆయన అని సంభోధించ బడుచున్నారు. వినడానికి, సహాయము చేయడానికి ఆయనకున్న శక్తిని గూర్చి అయన ఎరిగియున్నారు గనుక ప్రార్థన ద్వారా మనం ఆయనకు విజ్ఞాపన చేయాలని మనలను ఆయన ఆహ్వానించు చున్నారు. పరిపూర్ణ ఆత్మఅట్టివాడు. దేవుడు

అట్టివాడు.

**ఆత్మ స్వీయ దర్శకత కలిగియుండును: (Spirit is self Directive )**

ఆత్మ స్వీయ నిశ్చయతకు దర్శకతకు శక్తి కలిగియుండును. భౌతిక విశ్వానికి నిశ్చయించుకొనే శక్తి లేదు, అది తన ఉనికికి చలనానికి తనకు వేరై యున్న శక్తులపై ఆధారపడియున్నది. అయితే తన యిచ్ఛ చొప్పున దేనినైనా ఎప్పుడైనా జరిగించుటకు దేవుడు స్వాతంత్రుడు. ఈ లోకం ఎప్పుడు అంతమవునో ఆయనమాత్రమే ఎరిగి యున్నాడు. మరియు సమస్తముపైని ఆయన కంట్రోలు కలిగి యున్నాడు. అవుసరాన్ని బట్టి తగిన రీతిగా దేవుడు తనక్రియలను జరిగించును. మానవుడు పాపము చేస్తే దేవుడు ఖండించును, గాని మారుమనస్సు పొందితే ఆయన క్షమించును.

దేవుడు లోకమును సృజించినప్పుడు ప్రత్యేక ప్రయోజనము కొరకు సృజించెను. ఇప్పుడు సంభవించునవి ఆయన తనలో తాను నిర్ణయించుకొనెనని ఎఫెసీ 1:10 చెప్పుచున్నది, సమస్త ప్రయోజనములు తనచిత్త ప్రకారమైన సంకల్పమును బట్టియున్నవి (ఎఫెసీ 1:11). యివన్నియు ఆయన చేసిన నిత్య సంకల్పము చొప్పున యున్నవి (ఎఫెసీ 3:11). అందు వలన యేదీ ఛాన్సుకు విడిచి పెట్టబడలేదు, సంకల్పించుట యనగా గమ్యములను ప్రతిష్టించుట యని అర్థము. దేవునికి దర్శకత్వ సంకల్పము లేనియెడల ఆయన వ్యక్తిగత ఉనికి యదార్థము కాదు . దేవుడు తనలో తాను సంకల్పించినప్పుడు, సర్వజ్ఞానము స్వీయ దార్శకత్వము గల ఆత్మవలె ఆయన నిశ్చయించారు. నిర్ణయించారు.

**ఆత్మ ఆత్మతో లీనమవును: (Spirit Communes with Spirit)**

దేవుడు ఆత్మయై యున్నాడని యేసు చెప్పినప్పుడు ఆరాధనలో మానవుని ఆత్మకు దేవుని ఆత్మకు కలయిక సంభవించును, మానవుని ఆత్మదైవాత్మలోలీనమై ఆత్మయైన దేవుని ఆరాధించునని ఆయన యొక్క భావము. అయితే భౌతిక విశ్వములో యున్న దేనిని ఆరాధించినను మానవునికి యదార్థమైన సహవాసము లభించదు. ఏలయనగా దానిలో ఆత్మలకలయిక సంభవించదు. పాటలను వినువాడును, వాని ప్రార్థనల నాలకించు వాడునైన దేవుని మానవుడు ఆరాధించగోరును, తాను అర్పించు బలులను చూడని, వినని, గ్రహించుకోలేని, స్పందించలేని దానిని మానవుడు ఎందుకు ఆరాధించాలి? గ్రహించుకోలేని దానితో మానవుని ఆత్మ లీనమవదు, సహవసింపదు, "నిశ్చయముగా కొండల మీద జరిగినది మోసకరము, పర్వతముల మీద చేసిన ఘోష నిష్ప్ర

యోజనము. నిశ్చయముగా మా దేవుడైన యెహోవా వలన ఇశ్రాయేలునకు రక్షణ కలుగును" (యిర్మియా 3:23).

మానవుని ఆరాధన ఆత్మతోను సత్యముతోను జరిగినప్పుడు దేవుడు దానిని మన్నించి సంతోషించును. ఒక ఆత్మ వేరొక ఆత్మతో లీనమవును, అందు వలన దేవుడు జ్ఞానమూర్తి, ఆయన తనకుగా తానును, తనతో సంబంధమున్న ప్రతి దానిని ఎరిగి యున్నవాడు.

ఆరాధన ఆత్మల సహవాసము గనుక, ఉన్నత ఆదర్శములు అవసరము. మానవుడు దేనినైతే కొనియాడతాడో, శ్లాఘి స్తాడో దానిని ఆరాధిస్తాడు, అనుకరిస్తాడు. భౌతిక వస్తువులలోగాని, జంతువులలోగాని, వృక్షములలోగాని అతడొక ఉన్నత ఆదర్శాన్ని కనుగొనలేడు. ఏలయనగా సహజంగా మానవుడు ఒక వృక్షము వలెగాని, రాతి వలెగాని, కుక్క వలెగాని, ఏనుగు వలెగాని యుండగోరడు. మానవుడు కొనియాడి అనుకరించే లక్షణాలు, గుణగణాలు భౌతిక ప్రపంచములో యేమీ లేవు .

అయితే మానవుడు ఆత్మను కొని యాడగలడు, శ్లాఘించగలడు, అనుకరించి ఆరాధించగలడు. మానవుడు అనుకరించి కొనియాడే లక్షణాలను ఆత్మయైన దేవుడు కలిగియుండాలి, వాటితో మానవుడు తనలో అంతర్లీనమైన అవుసరాలను తీర్చుకోగలడు, తాను ఆరాధించు ఆత్మయైన దేవుడు తన ఆత్మీయ తృష్ణను తీర్చుచున్నాడని మానవుడు గమనించినపుడు అతడు వినయవిధేయతలతో సాష్టాంగపడి ఆయాత్మను ఆరాధించును, శ్లాఘించును, కొనియాడును, అనుకరించును. దేవుడు ప్రేమించును. కృపచూపించును, దయగలవాడు, దీర్ఘశాంతుడు, మంచివాడు, దాక్షిణ్యముగలవాడు, ఆదిలో దేవుని స్వరూపము నందు చేయబడిన మానవుడు, ఆత్మీయ వ్యక్తియై ఆగ్నోవ్పఆత్మను పునరుద్ధరించును. దీనిని అపో.పౌలు చాలచక్కగా ఇట్లు వివరించాడు: "మనమందరము ముసుకులేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింపజేయుచు మహిమనుండి అధిక మహిమను పొందుచు ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడు చున్నాము" (2 కొరింథీ 3:16).

# కుల ద్వేషాన్ని గూర్చి క్రైస్తవులేమి చేయాలి ?
## (Christians and Racial Prejudice ?)

మన సమాజములో యున్న విచారకర వ్యవస్థకులద్వేషము. యేసు జాతి ద్వేష సమాజములో జన్మించారు. ఆ ద్వేషాన్ని సంహరించడానికి ఆయన కృషి చేసారు. మొదటి శతాబ్దములో యున్న యూదునికి అన్యజనుడంటే ఎంతో హేయము. సమరయులను కొంత మట్టుకు వారు సహించేవారు. యేసు మంచి సమరయుని గూర్చిన ఉపమానము చెప్పి మానవులందరు సహోదరులేయని బోధించారు. యూదు డొకడు దొంగల చేతిలోబడి గాయపరచబడి నిస్సహాయ స్థితిలో యుంటే సమరయు డొకడు అతని ఆ ఉపమానములో ఆదుకొంటాడు (లూకా 13).

జాతిద్వేషము, కుల ద్వేషము అనునవి క్రైస్తవుని హృదయంలో చోటు చేసుకోకూడదు. "మెట్టుకునీ వలనీ పొరుగువానిని ప్రేమించుమను లేఖనములో యున్నట్టి ప్రాముఖ్యమైన యీ ఆజ్ఞను మీరు నెరవేర్చిన యెడల బాగుగనే ప్రవర్తించువారగుదురు. మీరు పక్షపాతము గల వారైతే ధర్మశాస్త్రము వలన అపరాధులని తీర్చబడి పాపము చేయు వారగుదురు" అని యాకోబు వ్రాసాడు (యాకోబు 2:8-9). ఇతరులు మనలను ఎట్లు చూడాలని కోరుదుమో, మిగతా జాతులవారిని కులస్థుల వారిని అట్లే మనం చూడాలి. "కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి " యని యేసు బోధించారు (మత్తయి 7:12).దేవుడు పక్షపాతికాడు (రోమా 2:11). దేవుడు ఏకులానికి , జాతికి పక్షపాతము చూపడు, ఆయన దృష్టిలో అందరు సమానమే. యేసు అందరి కొరకు మరణించి వారందరినీ ఆయన్నలో ఏకము చేయుటకు వచ్చారు (1 యోహాను 2:2). "శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవని" ఆయన బోధించారు (యోహాను 6:63).

అసూయ, ద్వేషము యింటిలోనే చంపబడాలి. తలిదండ్రులు పిల్లలను ప్రభువు యొక్క బోధలోను శిక్షణలోను పెంచాలి (ఎఫెసీ 6:4). అంటే మానవ జాతి యొక్క సమానత్వము, సహోదర భావము, ఒండొ

రుల యెడల గౌరవము మొదలగునవి గృహంలోనే బోధింపబడాలి. మానవు లందరు దేవుని స్వరూపమున చేయబడిన వారే (ఆదికా 1:26-27). "యేసు క్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు. ఇందులో యూదుడని గ్రీసు దేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు. పురుషుడని లేదని దేవుని స్త్రీ అని లేదు యేసు క్రీస్తు నందు మీరందను ఏకముగా యున్నారు. మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాము యొక్క సంతానమై యుండి వాగ్దాన ప్రకారము వానసులైయున్నారు. (గలతీ 3:7-9). యూదులకు అన్యులకు మధ్య వ్యత్యాసము లేదని పౌలు చెప్పుట లేదు గాని దేవుని దృష్టిలో అందరు సమానులే యని చెప్పుచున్నాడు.

వివిధ జాతుల వారి మధ్య, కులస్థుల మధ్య మనం సహోదర ప్రేమను ప్రోత్సహిం చాలి. ఏ భాషవారైనా, జాతివారైనా, కులస్థులైనా అందరు దేవుని దృష్టిలో ప్రశస్త మైనవారే. అందరి కొరకు క్రీస్తు మృతి జెందారు. "ఎవడైనను నేను దేవుని ప్రేమించు చున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును, తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింప లేదు, దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెను" (1 యోహాను 4:20).


మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా
ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక
కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.
-ఎడిటర్

## సత్యవాక్కు చదువరులకు గమనిక

మీ చేతిలోయున్న సత్యవాక్కు 31వ సంపుటిలో 6వ నంబరుగలది. గత 31న్నర సంవత్సరములలో విజయవంతముగా,నిరాటంకముగా ఈ పత్రికను నడిపించిన దేవునికి స్తోత్రములు.సత్యవాక్కు ద్వారా క్రైస్తవ లోకానికి దేవుని సత్యవాక్కును ఉన్నది ఉన్నట్లుగా ఉపదేశించుటకు ప్రయత్నించాము. సంఘాలకు, బోధకులకు, సామన్య క్రైస్తవులకు కూడ అది ఉపయోగకారిగా యున్నందున దేవునిస్తుతించుచున్నాము.

సత్యవాక్కు ద్వారా చదువరులకు లభ్యముకాని అనేక గ్రంధాలను,వ్యాసాలను, ప్రసంగ మాలికలను అందజేయ గలిగాము. అందులో ప్రకటన గ్రంధ ప్రసంగమాలిక ఒకటి. వాక్యాను సారముగా ఇచ్చుట గూర్చిబోధించు ' సాక్షిగాతుప్పు ' అనునది మరొకటి. ఇవి ఉదాహరణలు మాత్రమే, యివి ప్రాముఖ్యాంశములు గనుక ప్రతిసంచిక చదివిన తరువాత పదిలపరచుకొను మనవి.

సత్యవాక్కు ఇప్పుడు పదకొండు వేలకు పైగా గృహాలకు ప్రతినెల అందజేయబడుచున్నది. ఇంకను అనేకమంది దానిని కోరుచున్నారు.గాని ఆర్థికవనరుల లేమి వలన అందజేయలేక పోవుచున్నాము.సత్యవాక్కును చదివే ప్రతివ్యక్తి పై దీనిని పోషించే బాధ్యతయున్నది. పేపరు,ప్రింటింగ్,పోస్టేజీలు గత 30 సంవత్సరాల్లో పలురెట్లు పెరిగినా,సత్యవాక్కుసాలుచందా మాత్రం 50 రూ॥లకే పరిమితం చేసాము. అయినను విచారం యేమంటే కనీసం ఆరువేలమంది తమ బాధ్యతను విస్మరించారు గాని వారే ఈ పత్రిక అందకపోతే గోలపెట్టే వారిలో మొదట ఉంటారు. తదుపరి ఏరకమైన సాలుచందా చెల్లించకుండ గత 31 సంవత్సరాలుగా సత్యవాక్కును పొందుచున్నావారు కూడా యున్నారు. వారిలో ఎక్కువ మంది క్రీస్తు సంఘస్థులే,మరియు భోధకులే ఎక్కువ. అదిమహా శోచనియం.

మీకు సత్యవాక్కు అందుచున్నను, దానిని మీరు చదవకుండామూలన పడవేసే కోవకు చెందినవారైతే మాకు దయచేసి ఒక కార్డు వ్రాస్తే,వెంటనే దానిని నిలిపి వేస్తాం వేరొకరికి అందజేస్తాం. ఆసక్తితో చదువుచున్నవారైతే మీకనీస బాధ్యతను గుర్తించండి, ఆర్థిక చేయూతనియ్యండి.

ఈ నాలుగవ దశాబ్ధమంతా సత్యవాక్కు నిరాటంకముగా ప్రచురింపబడాలని,అనేక ఆత్మలను క్రీస్తుకొరకు ఆకర్షించుటయేగాక,వారిని విశ్వాసములో బలపరచుసాధనముగా యిది వాడబడలని మాకాంక్ష. ఇందు విషయమైన మా ప్రయత్నాలను,ప్రార్ధనల సహకారాన్ని దేవుడు దీవించునుగాక !

– ఎడిటర్

## మీ కొరకు గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్బీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:

# *Satya Vani*

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. VM/KD/02/2009-2011**

**To**

From:

**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by ... Satya Vani ... bhamurthy St. Kakinada - ...